# తొల్లూరు నాగేశ్వరరావు ఆధునిక నీతికథలు

ఉదయం తొమ్మిదింటిదాకా శ్రీమన్నారాయణ తెలుగు, ఇంగ్లీషు వార్తా పత్రికలు చదివాడు. ఒక అవినీతి కేసులో నెల్లూరులో ఒక ప్రభుత్వ డాక్టరు పట్టుబడ్డాడన్న వార్తను తెలుగు పేపర్లో చదవగానే ఆయన మనస్సు కలుక్కుమంది. ఓ అయిదు నిముషాలపాటు ఆయన ఆలోచనల్ని ఆ వార్తపైనే కందిరీగలాగా ముసిరి ఝుమ్మని పరిభ్రమించాయి. ఇంత చదువులు చదివి, ఇంత విజ్ఞానాన్ని సముపార్జించుకొని, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తూ, వేలకొద్దీ జీతాలు తీసుకుంటూ - అవినీతి బురదలో ఎందుకు దిగుతారో? ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎన్ని శతాబ్దాలు గడిచినా, శాస్త్రీయ సాంకేతిక విజ్ఞానంతో ప్రపంచం ఎంత ముందుకుపోయినా మనిషిలో ఈ అవినీతి అంశం తొలిగిపోదా?...

శ్రీమన్నారాయణ ఉద్యోగ నిర్వహణలో నిప్పులాంటి మనిషని ప్రతీతి. ఆయన రెండున్నర దశాబ్దాల ప్రభుత్వ సర్వీసులో పరాయివాళ్ల దగ్గర దురుద్దేశంతో కాఫీకూడా తాగి ఎరగడనే చెప్పుకుంటారు. అందుచేతనే ఆయన సర్వీసులో ఎన్నో ప్రమోషన్లు పొంది ఒక ఆఫీసుకు అధిపతి కాగలిగాడు అయితే___

నూతన సంవత్సరం ప్రారంభం నుంచి ఆయన మనస్సు అల్లకల్లోలంగా ఉంది నిద్రిస్తున్న చెరువులో ఎవరో తుంటరి రాయి విసిరినట్టు కొత్త సంవత్సరంనాడు ఓ సంఘటన జరిగింది ఆ రోజు ఆయన్ను చూసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి ఆఫీసు సిబ్బందిలో చాలామంది వచ్చారు. స్వీట్ ప్యాకెట్లు, యాపిల్స్, అరటిపండ్లు, నారింజలు మొదలైనవి తెచ్చి ఇచ్చి గ్రీటింగ్స్ చెప్పారు కాని ఆఫీసు మేనేజరు విష్ణుమూర్తి మటుకు ఓ చిరుకానుక సమర్పించాడు. అది ఇంగ్లాండ్‌లో తయారైన గిలెట్ అడ్జస్టబుల్ రేజర్.

"ఇది నాకు దేనికి? తీసుకెళ్ళండి" అన్నాడు శ్రీమన్నారాయణ నిర్మొహమాటంగా

"అయ్యా! అన్యథా భావించకండి. ఇది ఏమాత్రం లంచం కాదు. నా సంతోషం కొద్దీ మీకు సమర్పించుకొనే చిరుకానుక. దీన్ని నేను డబ్బెట్టి కొనలేదు మా అబ్బాయి అమెరికానుంచి పంపించాడు. మీరు తప్పకుండా స్వీకరించాలి" అన్నాడు విష్ణుమూర్తి బ్రతిమిలాడుతూ.

"దీని ఖరీదు ఎంత వుంటుంది?"

"ఆ! ఎంతోనా? పది రూపాయలు. అంటే అమెరికన్ కరెన్సీలో పది డాలర్లు."

ఏ మూడ్‌లో వున్నాడో శ్రీమన్నారాయణ ఆ కానుకను స్వీకరించాడు. ఆపూట ఆ రేజరుతోనే గడ్డం చేసుకున్నాడు. చాలా హాయిగా, సౌకర్యంగా వుంది 'క్లీన్ షేవ్' చేసింది కాని ఆయన మనస్సులో ఎక్కడో కనిపించని ముల్లు మెత్తగా గుచ్చుకుంటూనే వుంది.

ఆఫీసు మేనేజరు విష్ణుమూర్తి అవినీతిపరుడుగా చెడ్డపేరు తెచ్చుకున్నాడు. అతనిపై ఎన్నో ఆరోపణలున్నాయి. అలాంటి వ్యక్తి దగ్గర తాను ఆ కానుక తీసుకోవడం ఎంతో పొరపాటు తీసుకొని ఉండాల్సింది కాదు. ఇదీ ఓ రకమైన అవినీతిపనే. అవినీతిపరుడని పేరు పొందిన ఒక ఉద్యోగి చేతిమీదుగా కాఫీ తాగినా అవినీతి కిందకే వస్తుంది మరి. ఛీ!ఛీ తాను ఎంత పొరపాటు చేశాడు ఆ రేజరు తీసుకొని ఉండాల్సింది కాదు అనుకున్నాడు ఆ రోజునే!

ఆరోజు నుంచి ఉదయం ఆఫీసుకు వేళ్ళేముందు షేవ్ చేసుకొన్నప్పుడల్లా ఆ రేజరును చేత్తో పట్టుకోగానే శ్రీమన్నారాయణ రూపమే మనస్సులో మెదలసాగింది ఏదో కనిపించని ముల్లు మనస్సులో గుచ్చుకొన్నట్లుగా బాధ కలుగుతూనే ఉంది

ఆరోజు కూడా శ్రీమన్నారాయణకి తొమ్మిదిగంట లయ్యాక బాత్‌రూంలోకి వెళ్ళి సింకుముందున్న అద్దం ఎదురుగా నిలబడి గడ్డం చేసుకోసాగాడు. గడ్డానికి షేవింగు క్రీమ్ రాసి బ్రష్‌తో బాగా నురుగు వచ్చేదాకా రుద్దాడు. పక్కనే ఉన్న గిల్లెట్ రేజరును తీసుకొన్నాడు

ఆ రేజరులోంచి విష్ణుమూర్తి భయంకరంగా నవ్వుతున్నట్లు తోచింది ఆ నవ్వులో 'నువ్వెంత నీతిపరుడవో నాకు తెలిసిందిలే! నీ నుంచి ఏ సహాయాన్ని ఆశించకుండానే నూటయాభై రూపాయల ఖరీదుచేసే ఈ రేజరును నీకిచ్చాననుకుంటున్నావా అన్నట్లుగా తోచింది శ్రీమన్నారాయణకు.

శ్రీమన్నారాయణ మనసు అవ్యక్తమైన బాధలో అల్లల్లాడింది. గబ

గబా ఆ రేజరుతో షేవ్ చేసుకుని స్నానంచేసి పూజగదిలోకి వెళ్ళి అయిదు నిముషాలలో పూజ ముగించికొని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

భార్య భోజనం వడ్డించింది.

అప్పటికే ఆఫీసు నుంచి కారు వచ్చింది. డ్రైవరు డిక్కీలో ఫైళ్ళు పెట్టాడు.

శ్రీమన్నారాయణ భోజనం ముగించగానే ఆఫీసు కారెక్కి ఆఫీసుకు వెళ్ళాడు.

ఆ రోజు మధ్యాహ్నం లంచ్ తర్వాత టైపిస్టు పంకజాక్షి ఏడుస్తూ శ్రీమన్నారాయణ గదిలోకి వచ్చింది.

"ఏంటమ్మా? ఏం జరిగింది?" అన్నాడు శ్రీమన్నారాయణ.

నీటికుండ బద్దలైనట్లు బోరున ఏడ్చింది పంకజాక్షి. తనని లంచ్ టైములో ఆఫీసు మేనేజరు విష్ణుమూర్తి చెయ్యిపట్టుకుని అవమానించాడనీ, తన ఇంటి అడ్రసు చెప్తే రాత్రికి వస్తానన్నాడనీ' ఏడుస్తూ చెప్పింది.

శ్రీమన్నారాయణకు విపరీతమైన కోపం వచ్చింది. విష్ణుమూర్తి లంచాలు తీసుకోవడమే కాకుండా ఇట్లాంటి దుర్మార్గపు పనులు గూడా చేస్తున్నాడన్న మాట ఆఫీసులో ఇట్లాంటి వ్యవహారాలను సహించరాదు. "నేను కనుక్కుంటా లేమ్మా" అని ఆమెను పంపించాడు,

సాయంత్రం వరకు శ్రీమన్నారాయణ ఆ విషయాన్ని గురించే ఆలో చిస్తూ ఉన్నాడు విష్ణుమూర్తిపై తగిన చర్య తీసుకోవాలని ప్రగాఢంగా నిర్ణ యించుకున్నాడు. అయితే ఆ సాయంకాలం లోపల విష్ణుమూర్తికి కబురు చెయ్యలేదు

సాయంకాలం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే నేరుగా బాత్‌రూములో కెళ్ళాడు శ్రీమన్నారాయణ. నూతన సంవత్సర కానుకగా విష్ణుమూర్తి ఇచ్చిన ఎడ్జస్టబుల్ గిలెట్ రేజరును కిటికీలోంచి బయటకు విసిరివేశాడు కోపంతో అప్పుడు కాని మనస్సులోని కనిపించని ముల్లు తొలగిపోలేదు.

మరునాడు ఆఫీసుకు రాగానే విష్ణుమూర్తిపై పంకజాక్షి వ్యవహారంలో ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుతో ఎంక్వయిరీకి ఉత్తర్వులు జారీచేశాడు శ్రీమన్నారాయణ.

*కనిపించే ముల్లుకంటె కనిపించని ముల్లు పెట్టే బాధ ఎక్కువ*